## క్లుప్తంగా

### మంత్రి సురేఖకు సన్మానం



గీసుకొండ: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను గురువారం హైదరాబాద్‌లో కలిసి శాలువాలతో సన్మానించారు. మండల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని నాయకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు దౌడు భరత్, దూలం వెంకటేశ్వర్లు, జావిద్, దూలం జ్యోతిబసు, కంత్రి రవి, దౌడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### సీపీని కలిసిన ఎస్సై శ్రీనివాస్



చెన్నారావుపేట: కొత్తగా బాధ్యతలు చేపట్టిన స్థానిక ఎస్సై శ్రీనివాస్ వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిశోర్ ఝూను హనుమకొండలోని కమిషనరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి ఎస్సై శ్రీనివాస్ మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు.

### అనారోగ్యంతో వ్యక్తి మృతి

పర్వతగిరి: మండలంలోని కల్లెడకు చెందిన గీత కార్మికుడు ముంజాల సమ్మయ్య (48) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఆయన మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, పార్టీ నాయకులు పిన్నింటి సునీల్‌రావు, గంగాధర్‌రావు, మాజీ సర్పంచ్ బీలునాయక్, కాంగ్రెస్ నాయకులు ముదురుకోల రమేశ్, బోనగిరి దుర్గేశ్, చందు పరామర్శించారు.

### బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



దుగ్గొండి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూస రాజును అతడి తల్లి మల్లికాంబ 10 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత మల్లికాంబ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే రూ.10 వేల సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు రంగారావు, శెంకెసి కమలాకర్, మహిపాల్‌రెడ్డి, రవికుమార్, కామిశెట్టి ప్రశాంత్, యాదగిరి సుధాకర్, శెంకేసి రమేశ్, తొగరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**తిర్మలాయపల్లిలో..**

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన వశపాక ఎల్లయ్య, కొండూరు గ్రామానికి చెందిన రాయిని చంద్రమ్మ గురువారం మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు పరామర్శించాడు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కుందూరు రత్నాకర్‌రెడ్డి, బండి కుమార్‌గౌడ్, బండి రమేశ్, దొంతరబోయిన రాజు, వశపాక మహేందర్ పాల్గొన్నారు.

**శస్త్రచికిత్స చేయించుకుని..**

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన యాకుబ్‌పాషా ఇటీవల నిమ్స్ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని శంభునిపేటలోని బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా మజీద్ కమిటీ నాయకులు ముజిమ్మిల్, సుభాన్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

### నివాళి

నర్సంపేట: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన కొలువుల రాంబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం లక్ష్మి రామానంద్, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్ ఎలకటి విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కంకర కష్టాలు తప్పేదెన్నడో..?

● బీటీ తొలగించి నాలుగు నెలలు

సంగెం: కంకర రోడ్డుపై ప్రయాణంతో ఎదురౌతున్న కష్టాలు తప్పేదెన్నడో..? అని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బీటీ తొలగించి నాలుగు నెలలు గడచినా పూర్తి చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. మండలంలోని గుంటూరుపల్లి నుంచి బొల్లికుంట వరకు ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా గత ఆగస్టులో బీటీని పూర్తిగా తొలగించారు. వెంటనే కంకరపోసి వదిలేశారు. నెల రోజుల్లో మళ్లీ బీటీ వేస్తారని జనం ఆశించగా నాలుగు నెలలు గడచినా పని పూర్తి చేయలేదు. రెండు గ్రామాల రైతులు, ప్రజలు వ్యవసాయ, ఇతర పనులకు ప్రతి రోజూ ఈ దారి మీదుగానే ప్రయాణించడం పరిపాటి. సుమారు వంద మందికిపైగా ప్రతిరోజు పాడి గేదేలు, గొర్రెలు, మేకలు, కాడెళ్లతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి వస్తారు. ఈ క్రమంలో రైతులు, ప్రజలు కంకరపై రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర వల్ల పశువుల గిట్టలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు భయంతో వణికపోతున్న దుస్థితి నెలకొంది. బొల్లికుంట నుంచి వరంగల్, సంగెం వైపునకు వెళ్లే జనం, సంగెం నుంచి బొల్లికుంట మీదుగా మామునూర్, ఐనవోలు, వర్ధన్నపేట తదితర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై, కార్లలో ప్రయాణించే ప్రజలు కంకర వల్ల వాహనాలు దెబ్బతిని అవస్థ పడుతున్నారు. రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే దుమ్ము రేగుతుండడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంటలపై దుమ్ము పేరుకుపోయి పత్తి, ఇతర పంటలూ దెబ్బతింటున్నాయి. పత్తి, వరి దుమ్ము కారణంగా పశువుల మేతకు కూడా పనికి రాకుండా పోతున్నట్లు పలువురు రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

**వెళ్లాలంటేనే భయంగా ఉంది**

మా వ్యవసాయ భూములకు ప్రతీరోజు ఈ కంకర రోడ్డు మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. కంకర వల్ల ఎడ్లు, గేదెలు కూడా నడవలేకపోతున్నాయి. ఈ దారిలోకి రావాలంటే పశువులూ పారిపోతున్నాయి. త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

-కీర్తి కుమార్, రైతు, బొల్లికుంట

**త్వరలో బీటీ వేయిస్తాం**

బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దాన్ని తొలగించాం. ఎంఆర్‌ఆర్ నిధులు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. మెటల్ వేయించాం. బీటీ వేసేలోగా ఎన్నికల కోడ్ రావడంతో పని నిలిచిపోయింది. త్వరలోనే బీటీ పనులు పూర్తి వేయిస్తాం.

-అభిరామ్, పీఆర్, స్పెషల్ ఏఈ



కంకర వేసి వదిలివేసిన దృశ్యం

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజ చేస్తున్న ప్రకాశ్, తదితరులు

వర్ధన్నపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని గురువారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లిని అనాదిగా కుల దైవంగా భావిస్తూ పూజిస్తున్నారని చెప్పారు. అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఆలయాన్ని నిర్మించుకుని అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి సోమయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్‌ఖన్నా, సర్పంచ్ కొడగాని కవిత రాంబాబు, ఎంపీటీసీ మంగీలాల్, నాయకులు బత్తుల వీరస్వామి, కుక్కల అంజయ్య, బత్తుల స్వామి, పున్నం స్వామి, నర్సయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# రగ్బీ పోటీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థికి ప్రశంసా పత్రం, మెమోంటో అందజేస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట: 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ (ఎస్‌జీఎఫ్‌టీఎస్) నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థిని మోఖిరెడ్డి భూమికను కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు ఊర్మిళ, వెంకటరమణారెడ్డి అభినందించారు. పాఠశాల ఆవరణలో వానే విద్యార్థినికి ప్రశంసా పత్రం, మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. భూమిక ప్రతిభ కనబర్చి నాల్గో స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'జీడీఎస్'లపై మొండి వైఖరి తగదు



సమ్మె చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

నర్సంపేట: తపాలా జీడీఎస్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం తగదని ఏఐజీడీఎస్ యూనియన్ మాజీ అధ్యక్షుడు శాబుద్దీన్ ఆకాంక్షించారు. పట్టణంలోని పోస్టాఫీస్‌లో జీడీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకోగా ఆయన హాజరై మాట్లాడారు. జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, పెన్షన్ అమలు చేయాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించి గ్రాడ్యూటీని రూ.5 లక్షలకు పెంచాలని, టార్గెట్ పేరుతో వేధింపులు ఆపాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెలో జీడిఎస్ ఉద్యోగులు అశోక్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, యాదగిరి, రాజశేఖర్, రత్నాకర్, సతీశ్ చంద్ర, కల్పన, అనూశ, రవి, అఫ్రోజ్, పవన్, కృష్ణ, కిశోర్, ప్రభాకర్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా పడిపూజ



నెక్కొండ: మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో గురువారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. 'స్వామియే శరణం అయ్యప్పా..' అంటూ అయ్యప్ప స్వాములు, భక్తుల శరణఘోషతో మహా పడిపూజ మార్మోగింది. పలు గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున వచ్చారు. శ్రీరంగం సంపత్ గురుస్వామి పర్యవేక్షణలో తాళ్లపెల్లి చెన్నకేశవులు, కొయ్యడి ప్రశాంత్, బుడిగ వెంకటేశ్ ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప కీర్తనలు, పాటలు ఆకట్టుకున్నాయి. అయ్యప్ప మాలధారులు నియమనిష్టలతో స్వామిని భక్తితో కొలిచి ఇరుముడి ధరించి, శబరిమలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటారని గురుస్వాములు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములతోపాటు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే మానవ హక్కుల పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మైస వసంత

నర్సంపేట: అవగాహన కలిగి ఉండడం ద్వారానే మానవ హక్కులను పరిరక్షించుకోగలమని స్వేచ్ఛ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు మైస వసంత తెలిపారు. పట్టణంలోని బొందబడి మండల్ పరిషత్ ప్రైమరీ స్కూల్ (ఎంయూపీఎస్)లో ప్రధానోపాధ్యాయురాలు శాంతికుమారి అధ్యక్షతన గురువారం నిర్వహించిన 75వ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవానికి వసంత పాల్గొని మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా, కుల, మత, జాతి, లింగ భేదాలకు అతీతంగా జీవించడాన్ని మానవ హక్కుగా అభివర్ణించారు. మానవ హక్కుల కమిషన్ కల్పించిన జీవించే, స్వాతంత్ర్య, విద్య, తదితర 30 హక్కులను పొందాలని సూచించారు. భారత రాజ్యాంగం ప్రజలకు హక్కులను కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రతిభ సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి సంస్థ అధ్యక్షుడు బెజ్జంకి ప్రభాకర్, ఛాయా సంస్థ అధ్యక్షుడు కోట డేవిడ్, ఉపాధ్యాయులు కూచన శ్రీనివాస్, శ్యామ్ కుమారస్వామి పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు 'సఖి' సేవలు



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న శోభారాణి, తదితరులు

గీసుకొండ: వరకట్నం, గృహహింస, ఇతర బాధిత మహిళలకు సఖి కేంద్రం పలు సేవలు అందిస్తుందని లీగల్ కౌన్సెలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో పొదుపు సంఘాల మహిళలకు మహిళా రక్షక చట్టాలపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళలు గృహహింస, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నుంచి బయటపడటానికి అనేక చట్టాలున్నాయని చెప్పారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సఖి కేంద్రం ద్వారా ఉచిత న్యాయ, వసతి, తదితర సేవలు అందుతాయని తెలిపారు. బాధిత మహిళలు సఖి కేంద్రంలో లభిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. సాయం కోసం 181కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సఖి కేంద్ర ఉద్యోగి సుధ, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.

## పేదింటి డాక్టర్‌కు పీజీలో సీటు



నల్లబెల్లి: ఓ పేదింటి ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్‌కు ఉన్నత స్థాయి వైద్య విద్య అభ్యసించేందుకు పీజీ (ఎంఎస్)లో సీటు వచ్చింది. మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన రసపుత్ర నిర్మల-రాజు దంపతుల కొడుకు డాక్టర్ సాయికుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. గొరక్‌పూర్ ఏఐఐఎంఎస్‌లో జనరల్ సర్జన్ సీటు సాధించాడు. సాయికుమార్ తల్లి అంగన్‌వాడీ టీచర్ కాగా తండ్రి పేద రైతు. పేద రైతు కుటుంబానికి చెందిన సాయికుమార్ వైద్య విద్యలో పీజీ అభ్యసించేందుకు సీటు సాధించడంతో ఆయన్ను పలువురు అభినందించారు.

# హమాలీల కూలి రేట్లు పెంచాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న కృష్ణ, తదితరులు

నెక్కొండ: గోదాంల్లో బెడ్డింగ్ దిగుమతుల్లో పని చేసే హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 29 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంబంధించిన నోటీస్‌ను జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ ప్రసాద్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. రెండేళ్ల క్రితం మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గోదాముల యజమానులతో నిర్వహించిన చర్చల ఫలితంగా లారీ దిగుమతులకు కూలి రేట్లు రూ.4,700లుగా చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని చెప్పారు. మూడు నెలలుగా యజమానుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. యజమానులు నిర్ణయించిన రేట్లకు కార్మికుల పని చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. పెంచిన రేట్లను అందించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 29 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో రవి, శ్రీధర్, సాంబయ్య, నర్సయ్య. శ్రీనివాస్, వీరస్వామి, పాల్గొన్నారు.

# సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గొంగళ్ల అశోక్ తెలిపారు. సంఘమిత్ర బాల భవన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నర్సంపేటలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం డ్రాయింగ్, వాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే దిశగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు ఈనెల 17న సంఘమిత్ర బాలభవన్ ఆధ్వర్యంలో బహుతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొర్ర సారయ్య, శాంతికుమారి, కాంతారావు, ఉపాధ్యాయులు గడ్డం సుజాత, భిక్షపతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేయూత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మాచర్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడితో కలిసి 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న స్నేహితులు అతడి కుటుంబానికి చేయూతనిచ్చారు. శ్రీనివాస్ కూతురు నేహ పేరుపై రూ. 38 వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మిత్రులు కందగట్ల సంతోష్, మార్త సుమన్, బాసని రవి, గుండు రాము, మార్త శ్రీనివాస్, బాసాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



నినాదాలు చేస్తున్న ఇస్మాయిల్, తదితరులు

సంగెం: మండలంలోని రామచంద్రాపురం, లోహిత, షాపూర్, కొత్తగూడెం, ఎల్గూర్ రంగంపేట తదితర గ్రామాలకు పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడిపించాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజల సేకరించిన సంతకాలతో కూడిన ఉత్తరాలను ఆర్టీసీ వరంగల్, హనుమకొండ డిపో మేనేజర్లకు గురువారం పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడారు. మండలంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయని చెప్పారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించినా బస్సు సౌకర్యం లేకపోవడంతో వృథా అవుతోందని తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించకుంటే ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోనే రాంచందర్, అశోక్, శ్రీనివాస్, ఎనబోతుల సాంబయ్య, సోమిడి రవి తదితరులు పాల్గొన్నారు.

# 'మా అభిప్రాయాన్ని పరిగణించండి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గీసుకొండ: కాంగ్రెస్‌లో ఎవరైనా చేరితే వారి విషయంలో తమ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని, కొండా దంపతులను, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని కోనాయమాకుల సమీపంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం శ్రీనివాస్, నాయకులు మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా పార్టీకి ద్రోహం చేసేలా కొందరు ఇతర పార్టీల్లో చేరారని చెప్పారు. అలాంటి వ్యక్తులు మళ్లీ కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. స్వార్థం కోసం పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరిన వారిని మళ్లీ పార్టీలో చేర్చుకునే పరిస్థితి వస్తే ముందస్తుగా గ్రామ, మండల నాయకుల అభిప్రాయాన్ని తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆకుల రుద్రప్రసాద్, సాయిలి ప్రభాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'గృహలక్ష్మి' ఇళ్ల పరిశీలన

దామెర: మండలంలోని ఊరుగొండ, దుర్గంపేట, సీతారాంపూర్, పసరగొండ గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత గురువారం సందర్శించారు. అందులో భాగంగా ఇటీవల గృహలక్ష్మి పథకం ద్వారా బేస్‌మీట్ నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశాల మేరకు గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పర్వతగిరి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహించి బదిలీ అయిన హెచ్‌ఎం జలీల్, ఉపాధ్యాయులు పి.కృపాల్, ఎల్.వంశీకృష్ణ, బి.రాజు, జి.రాజు, జి.రమేష్, ఎం.సురేఖలను హెచ్‌ఎం బండి రమేశ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టైలరింగ్ శిక్షణను వినియోగించుకోండి

శాయంపేట : టైలరింగ్‌లో ఉచిత శిక్షణను నిరుద్యోగ మహిళలు వినియోగించుకోవాలని నవయుగ సొసైటీ అధ్యక్షుడు కోసరి గోపాల్ సూచించారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు జనశిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్ కూడా అందిస్తామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని అన్నారు. ఈ శిక్షణను అర్హులైన పేద మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన, జనశిక్షణ సంస్థాన్ అధికారులు, ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ ప్రియాంకరెడ్డి, ఉపసర్పంచ్ సురేందర్, బీసీఐ రైతు దేవేందర్‌రెడ్డి, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు హిమబిందు, సునీల్, తిరుపతి, గౌస్, ప్రశాంత్, ట్రైనర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

ఆత్మకూరు: ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి రాజు తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో 'మా సోషల్ ఆక్టివిటీస్' సంస్థ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ .. ప్లాస్టిక్ నివారణ' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించ్చారు. ప్రతి అవసరానికి ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ఇంటి వద్ద నుంచి ప్రత్యామ్నాయంగా కాటన్, జూట్, ఇతరత్రా నష్టం కలిగించని బ్యాగులను వెంట తీసుకుని వెళ్లాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ నాగబండి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.